# చేయూత

సైకిలుకి బెల్లులాగా, బస్సుకి హారనులాగా, రైలుకి కూత లాగా గోవిందం మేస్టారికి దగ్గు, అలాగ.

ఖంగు ఖంగు ఖంగుమని మూడుసార్లు దగ్గు వినిపిస్తుంది గుమ్మాని కవతల. ఒక్క నిమిషం గేపిచ్చి మళ్ళీ ఖంగు మంటుంది. దగ్గు ఖంగుమనడమేవిటి, మేస్టారు స్టాఫ్‌రూములో కనిపిస్తారు. అది అలవాటే అనుకోవాలో జబ్బే అనుకోవాలో నాకైతే బోధపడదు.

ఆ రోజులాగే మూడుసార్లు దగ్గు వినిపించింది. ఇంకో నిమిషంలో గోవిందం మేస్టారు కనిపిస్తారని గుమ్మంవేపు చూద్దును, దగ్గు గేపిచ్చింది. కాని మళ్ళీ దగ్గు వినిపించలేదు. గుమ్మానికి ఆనుకుని నిలబడిపోయిన గోవిందం మేస్టారు మాత్రం కనిపించేరు. "ఏవిటండి" అంటూ దగ్గరకు వెళ్ళేను.

"గుండెల్లో ఏదో గాభరాగా వుంది." అంటూ గుమ్మం దగ్గరే కూలబడిపోయారు. నేనా....కుర్ర మేస్టార్ని.... టీచింగు లోనే కాదు జీవితంలోనూ అనుభవంలేమ. ఏంచేయాలో తోచ లేదు. ఇటు చూసేను. అటు చూసేను. అక్కడ కనిపించిన గ్లాసందుకుని చల్లటి నీళ్ళుతేబోయేను...మొఖంమీద చిలకరిస్తే తెలి వొస్తుంది కదా అని.

ఈలోగా ఒక్కొక్కరూ చేరేరు. చేరి, జరిగింది చూసేరు. చూసి, అసలు విషయం చెప్పేరు.

గోవిందం మేస్టారు జీవితం చాలించుకున్నారు!

ఇప్పుడంటే ఇప్పుడు ఆయన దగ్గిన మూడు దగ్గులూ ముప్పయ్ రెట్లయ్యి చెవుల్లో గింగురు మంటున్నాయి.

"సిగరెట్లెందుకు కాలుస్తావు కాశీపతీ....కుర్రాడివి.. ఆరోగ్యం దెబ్బతినదూ...."అని ఆయనింకా మందలిస్తున్నట్లే వుంది.

"గుమస్తా అయితే మాత్రం మనలో తిరిగిన మనిషేకదా. చచ్చిపోతే సానుభూతి చూపించడానిక్కూడా మైలవుంటుందని చెప్పుకోడానికి సిగ్గుపడాలి. ఆ మాట అనే బదులు మనిషి జన్మే ఎత్తకుండా వుండాలి..."అంటూ తోటి వుపాధ్యాయులనింకా ఎడ్యుకేట్ చేస్తూన్నట్టేవుంది.

"పొలం దున్ని పంట పండించే రైతూ, కార్ఖానాలో ఉత్పత్తులు పెంచే కార్మికుడూ-వీళ్ళంతో ...భావి సంపదని తీర్చి దిద్దే మనమూ అంతే. ఈ సోషలైజేషన్ మన హక్కులు సాధించుకోడానికి అంతేగానీ ఇంకా పూర్వంలా గురుర్దేవోభవ అని దేశం అంతా పాదాభివందనం చెయ్యాలనుకోవడం మూర్ఖత్వం...." అంటూ ఉపాధ్యాయుల ను తేజపరుస్తున్నట్టే వుంది.

చెయ్యాల్సిన తతంగమంతా పూర్తయ్యేక ఇంటికొచ్చి, ఇంత కతికి పెరట్లో మంచంమీద కూర్చున్నాను-దిగాలుగా.

వెండిపళ్ళేనికి ఎండపొడ తగిలి మెరిసినట్లుగా చంద్రుడు మిలమిల్లాడుతున్నప్పటికీ, అంతదూరానున్న నల్లటి మబ్బుతునక దాన్ని మృత్యువులా మింగజూస్తున్నట్టుగానే నాకు కనిపిస్తూంది. పెరట్లోని కొబ్బరాకులు గాలికి కదిలినప్పుడు వెండి తడితో తళతళ్ళాడుతున్నప్పటికీ, అది కన్నీటి తడిలాగానే నాకు కనిపిస్తూంది.

ఎటు చూసినా, ఏది చూసినా గోవిందం మేస్టారే కళ్ళకి కనబడుతున్నారు.

ఏవిటా గోవిందం మేస్టారి ప్రత్యేకత ?

గోవిందం మేస్టారి చావు నన్నెందుకింతగా కలవరపెడుతోంది ?

ఆయనకున్న పేదరికంతో రాజీపడలేక భవిష్యత్తులో సుఖాలు వెతుక్కుంటూ ఆశల్తో ఆయన కూతురు లేచిపోయిందా? జీవితమంతా రెక్కలు ముక్కలు చేసుకుని పెంచి, చదివించి, పెద్దచేసిన కొడుకు నిన్నగాక మొన్న వచ్చిన కోడల్తో వేరింటి కాపరం పెట్టేడా ? బెత్తెడు గొర్రెతోక జీతాన్ని పెరుగుతున్న అవసరాలకు ఎలా సర్దాలో తెలియక, ఆకలితో ఆయన భార్య రాచి రంపానపెట్టేదా ?

కాదు ఎంతమాత్రం కాదు.

ఆయన్తో నాకున్న స్నేహమే—నేనింతగా కలతపడటానికి కారణం. ఆయన వయసుకీ, నా వయసుకీ మధ్య నా

వయసున్న మరో కాశీపతి పట్టేస్తాడు. అయినా మా ఇద్దరికి స్నేహం కుదిరింది.

"ఒరే కాశీ....ఇందాకటినుండి కేక లేస్తున్నా పలక వేంరా.." అంటూ అమ్మొచ్చి మంచానానుకుని కిందనే చతికిలబడింది.

"ఏంటమ్మా ?" అనడిగేను.

"ఏంలేదూ... గోవిందం మేస్టారి కేవిట్రా సుస్తీ ?"

"ఇవ్వాళ్టివరకూ ఏంలేదమ్మా....అకస్మాత్తుగా గుండె నొప్పి వచ్చి స్కూల్లోనే కూలిపోయేరు ...బహుశా ఆయనకున్న మనోవ్యాధి....కూతురి పెళ్ళి, కొడుకు నిరుద్యోగమూ అనుకుంటాను...." అన్నాను.

కళ్ళలో మేస్టారి రూపమూ, చెవుల్లో మేస్టారి మాటలూ గింగురుమంటున్నాయి.

"ఉపాధ్యాయుడు సెల్ఫ్ డిసిప్లిన్ పెంచుకోవాలయ్యా.. చేసుకునే అలవాట్లలోనూ, తినేతిండిలోనూ, మాట్లాడే మాటల్లోనూ డిసిప్లిన్ కనిపిస్తే....మరింక పాఠం చెప్పనే అక్కర్లేదు విద్యార్థికి....వాడే నేర్చుకుంటాడు...."అనేవారు.మరి ఆడిసిప్లిన్ తెచ్చిన ఆరోగ్యం ఆయన్నేం కాపాడిందో ఆయనే చెప్పాలి ?

"ఒరేయ్....ఏవిట్రా ఆ పరాకూ" అంటూ కుదుపుతోంది అమ్మ.

"ఆఁ....ఏవిటమ్మా" అన్నాను తెలివి తెచ్చుకుని.

"ఏవిటీ! ఇంతసేపు చెప్పిందీ విన్లేదూ....సర్లే నాకు తప్పుతుందా? ఇవాళ మీ చిన్నాన్న స్నేహితుడు లేడూ....ఆదే సుబ్బరామయ్య గారు వచ్చివెళ్ళేరు. ఆదే ...నాత్రోజుబుగా అడుగుతున్నదే ...వాళ్ళమ్మాయిని నీకివ్వడానికి ..."

"అమ్మా....నా మనసేం బాగులేదు గానీ....ఆ పెళ్ళి విషయం ఇప్పుడేం చెప్పకు...." అన్నాను విసుగ్గా మంచంమీద వాలిపోతూ.

"నాకుతెలుస్రా కాశీ....గోవిందం మేస్టారు పోవడం... నీ బాధాను. కానేం చెయ్యనుచెప్పు....పెద్ద మగ దక్షతలేని దాన్నయ్యేను....అన్నీ నేనేను...."అంటూ ఒకసారి ముక్కు చీదుకోవడానికాగింది అమ్మ......"అయినా ఒక్కగానొక్కతే.. బోలెడు కట్నమిచ్చి వైభవంగా పెళ్ళి జరిపిస్తానని ముచ్చట పడిపోతున్నాడు....ఆయనకి ఏ విషయమూ వెంటనే తెలియజేయ్యాలాకాశీ....లేపోతే బాగుండదు. ఆపైన నీపెళ్ళీ....నీ ఇష్టం నాయనా" అంటూ అమ్మ నెమ్మదిగా గొణుక్కుంటూ లేచి లోపలికి వెళ్ళిపోయింది.

ఎంతసేపో గోవిందం మేసారి మరణం గురించీ, ఆయన కుటుంబం గురించీ ఆలోచిస్తూండిపోయేను. వాళ్ళకి రావాల్సిన ఆయన్తాలూకు ప్రావిడెంటుఫండూ, ఫేమిలీబెనిఫిట్ ఫండూ మొదలైనవాటి గురించిన ప్రొసీజర్ తెలుసుకోవాలి. ఫేమిలీ పెన్షను ఫారాలు తీసికొని, నింపించి పంపాలి. ఆయన పోయేరు

కాబట్టి వాళ్ళబ్బాయికి ప్రభుత్వోద్యోగం వచ్చే ప్రయత్నాలు చెయ్యాలి. నా శాయశక్తులా కృషిచేసి, ఆయన చవిచూపిన స్నేహ మాధుర్యానికిగాను వాళ్ళ కుటుంబాన్ని ఆదుకోవాలి — అను కుంటూ నిద్రలోకి జారిపోయేను.

అనుకున్నట్టుగానే పెన్షనుపారాలు తీసుకున్నాను. మా యూనియన్ సెక్రటరీని కలిసి మిగిలిన వాటికి అనుసరించాల్సిన పద్ధతులు తెలుసుకున్నాను. మున్సిపాల్టీ ఆఫీసుకు వెళ్ళి డెత్ సర్టిఫికెటు తీసుకున్నాను. డియ్యీవో ఆఫీసుకు వెళ్ళి అవి తొందరగా వాళ్ళ కుటుంబానికి అందవలసిన అవసరం గురించి విన్నవించుకున్నాను.

విషయాలు తెలుసుకున్న తర్వాతా, ఇంతమందిని కలిసిన మీదటా, వివరాలు కనుక్కున్నాకా ఓ ఏడాదికైనా, అందాల్సినవి, వాళ్ళ కుటుంబానికి అందుతాయా అనిబెంబేలెత్తిపోయేను.

డ్యూటీ కాలంలో ప్రాణాలు వదిలేస్తే ఇతర డిపార్టుమెంటుల్లో గానీ, ప్రైవేటు సంస్థలలోగానీ రిటైరయిన రోజునో, చనిపోయిన రోజునో వాళ్ళకి రావాల్సినవి భద్రంగా పొట్లం కట్టి మరీ చేతుల్లో పెడతారు. నేను బ్రతికి ఉండగానే-ఏంలేదూ-ప్రావిడెంటుఫండు లోను మంజూరు చేయించుకోవడానికి ఎన్నిపాట్లు పడ్డానో నాకు తప్ప ఎవరికి తెలుసు?

అటువంటిది ఎవ్వరి ఆసరాలేని మేస్టారి భార్య ఈ పనులన్నీ ఎలా చేయించుకోగలరు?

ఇవన్నీ ఆలోచించుకుంటూ గోవిందం మేస్టారింటికి ఎప్పుడు చేరుకున్నానో నాకే తెలియదు.

ఆ ఇల్లు....

తల్లిలేని పిల్లలా జాలిగా చూస్తోంది. గట్టునపడిన చేపలా గిలగిల్లాడుతోంది. గోవిదం మేస్టారు లేని యింటో అడుగు పెడుతోంటే ఒక్కసారిగా దిగులు ముంచెత్తుతోంది.

ఆయన భార్య-ముత్తయిదువలా, మహాలక్ష్మిలా కళకళ లాడుతూ ఎదురొచ్చి "ఏం బాబూ, వచ్చేవా....కాఫీ తీసుకో" అంటూ పలకరించేది-శోకమూర్తిలా స్తంభానికి చేరబడికూర్చుని వుంటే ఆమెతో ఏం మాట్లాడి ఎలా ఆమె దుఃఖాన్ని పోగొట్టాలో తెలియలేదు.

ఇటు పక్క గోవిందం మేస్టారి పాతికేళ్ళ కొడుకు-కాళ్ళూ, చేతులూ విరిగిపోయినట్టుగా మంచం మీద వెల్లకిలా పడుకుని ఎర్రని కళ్ళతో ఇంటి కప్పును తీక్షణంగా చూస్తూ వుంటే పరిస్థితిని వివరించి, చెయ్యాల్సిన పనుల గురించి ఏం చెప్పి, ఎలా కార్యోన్ముఖుణ్ని చేయాలో అర్థం కాలేదు.

అటుపక్క గోడనానుకుని గోవిందం మేసారి పద్దెనిమిదేళ్ళ కూతురు తల్లినీ, అన్ననీ చూస్తూ తండ్రి వున్నప్పుడు తన పెళ్ళి జరగకపోవటానికి కారణమూ, ఆయన లేనప్పుడు

తన పెళ్ళి జరగటానికి ఉండే అవకాశమూ-వీటి గురించి వెతు క్కుంటూ కూర్చుని వుంటే ఆ అమ్మాయికి ఏం చెప్పి ధైర్యం కలిగించాల్సిందీ బోధపళ్ళేదు.

అందుకే....

అక్కడే వున్న చిన్న బల్ల మీద మౌనంగా కూర్చుండి పోయేను. ఎంత సేపలా కూర్చున్నానో-మా స్కూల్లోని తెలుగు మేష్టారు వచ్చి పలకరించేదాకా తెలియలేదు.

"ఏవిటి కాశీపతీ....యిక్కడే వున్నావా ...ఏదో వీళ్ళకి ధైర్యం చెప్పి ఆసరాగా వుంటావనుకుంటే నువ్వుకూడా ఇలా దిగులుగావుంటే ఎలానోయ్....అన్నట్లు ఎఫ్‌బీఎఫ్, పి.యఫ్ వీటి గురించి మన గుమాస్తాతో మాట్లాడేవా. ..ఏదో పెర్సం టేజ్ ఇచ్చెయ్యాల్సిందేనయ్యా" అంటూ గడగడా మాట్లాడుతూ వుంటే చెప్తానుండమన్నట్టుగా అరచెయ్యిచూపేసు.

గాలివాన వెలిసినట్టుగా, దిగాలు మధ్య ఆశాకిరణం అన్నట్టుగా అందరూ నా వైపే చూస్తున్నారు.

"కనుక్కున్నాను మేష్టారూ. ముక్కుకు సూటిగా పోదా మంటే ఈ కాలంలో ఇలారా సేరేవిటీ ...ఇక్కడ సంతకం వుండాలే అంటూ యక్ష ప్రశ్నలూ లక్ష ఆటంకాలూ పెడు తున్నాడు. మన సెక్రటరీ ద్వారా అడిగిస్తే బిర్ర బిగుసుకు పోయి ఇప్పుడు ఖాళీ లేదు పొమ్మన్నాడు. చివరికి ఇంటికి వెళ్తే పెర్సంటేజ్ చెప్పేడు. అది కూడా అతని వాటా మాత్రమే మేసారూ....ఈ లెక్కన యీ కుటుంబానికి చేరేసరికి ఏం

మిగుల్తుందంటారు" అన్నారు.

అప్పటికి మేస్టారి భార్య నోరు విప్పింది.

"బాబూ....కాశీపతీ ...మా విషయంలో ఇప్పటికే ఎంతో శ్రమతీసుకున్నావు. మా గురించీ, మా బతుకుల గురించీ నువ్వు ఇబ్బందుల్లో తలదూర్చి ఇక్కట్లపాలవకు నాయనా.... వాళ్ళు ఎలా చెప్తే వాటికలా ఒప్పేసుకో... అబ్బాయికి ఎలానూ మేస్టారు ఉద్యోగం యిస్తున్నారుకదా. అంతవరకూ కలో గంజో తాగుతాం.ఇక పోతే పోయి బతికిపోయారు మీ మేస్టారు.బతుకుతూ చస్తూవున్న నాకు ఉన్న బెంగల్లా....అమ్మాయి గురించే బాబూ" అంటూ మళ్ళీ దుఃఖపు తెర ముంచుకురావడంతో ఆగిపోయింది.

ఎందుకో ఒక్కసారిగా కళ్ళు తెరుచుకున్నట్టయింది నాకు అపుడు!

మేష్టారి మీద నాకు స్నేహభావమే వుంటే ఆయన ఆత్మ తృప్తికి నేను చేయవలసినది ఒకటి వుంది.

అమ్మకి నా వల్ల రావాల్సిన కట్నం మీద ఆశ వుండి వుండొచ్చుగాని, నా సుఖసంతోషాల మీదున్న ఆసక్తి కన్నా ఎక్కువ గాదు. నా పెళ్ళి వైభవంగా జరిగితే చూడాలన్న కోరిక వుంటే వుండొచ్చు గాని, ఇల్లూ ఒళ్లూ గుల్ల చేసుకుని చేసే కార్యాలమీదున్న అసహ్యం కన్నా ఎక్కువకాదు.

అమ్మకి....నా పెళ్ళి ముఖ్యంగాని, బలరామయ్యగారి అమ్మాయితోనా, లేక గోవిందం మేస్టారి అమ్మాయితోనా అని కాదు.

ఇప్పుడెంత నిస్వార్ధంగా వాళ్ళ కుటుంబానికి సాయం చేద్దామనుకున్నా నామీదనో, వాళ్ళమీదనో అపనిందలు రావొచ్చును. గోవిందం మేస్టారి అల్లుడిగా నేనేసహాయం చేసినా పిళ్ళకిగానీ, లోకులకిగానీ ఏ అభ్యంతరమూ వుండదు.

ఈ నిర్ణయానికి రావడంతోనే కడుపు నిండినట్టయింది. దుఃఖం, దిగులూ చేత్తో తుడిచేసినట్టయింది.

అవును!

చనిపోయిన మేస్టారికి ప్రభుత్వం చెయ్యగలిగిన సహాయంకన్నా నేనివ్వబోయే చేయూతే ఎక్కువ అనుకునేసరికి నా గుండెలు తృప్తితో తేలికై పోయాయి. ★